426) కాంభోజి

ప॥ చూచి మోహించకుందురా సురలైన నరులైన । తాచి నీవు ముందర బ్రత్యక్షమైనను ॥

చ॥ భాగీరథి పుట్టినపాదపద్మములు । భోగపుమరునిజన్మభూమి నీతొడలు ।
యోగపునవబ్రహ్మలుండిననీనాభి । సాగరకన్యకలక్ష్మి సతమైనవురము ॥

చ॥ అందరి రక్షించేటిఅభయహస్తము । కంద నసురలజంపేగదహస్తము ।
సందడిలోకములయాజ్ఞాచక్రహస్తము । చెంది ధ్రువు నుతియించజేయుశంఖహస్తము ॥

చ॥ సకలవేదములుండేచక్కనినీమోము । వొకటై తులసిదేవివుండేటిశిరసు ।
ప్రకటపుమహిమల బాయనినీరూపము । వెకలిశ్రీవేంకటవిభుడ నీభావము ॥